
నవ్వుకుందాం
సుధామ

# నవ్వుకుందాం

**రచన**

సుధామ

**ప్రచురణ**

శ్రీ మానస పబ్లికేషన్స్

శ్రీపతి సూర్యనారాయణ వీధి

గవర్నరుపేట : : విజయవాడ - 520 002.

# నవ్వుకుందాం

సుధామ

శ్రీ మానస ప్రచురణ

ప్రధమ ముద్రణ

మే - 2001

వెల. రు. **14-00**

లోపలి బొమ్మలు } గోపి
ముఖ చిత్రం

All Rights including subject matter and
Title style are reserved with the publishers.

# నవ్వుకుందాం

ప్రతి ఆదివారం ఆ వీధిలోని డాబాయింటి మేడ మీద వారందరూ కలుసుకుంటూ ఉంటారు. వారిలో మగవారు, ఆడవారు, పిల్లలూ అందరూ ఉన్నారు. వారంతా మిత్రులు.

ఆ విధంగా అందరూ సమావేశం అవడానికి ఒక కారణం ఉంది. అదేమిటి అంటారా ? వారం మొత్తం మీద పనిపాటలతో అలసిపోతారు కదా! శరీరానికి, మనసుకు హాయి, విశ్రాంతి కావాలి. అందుకు "నవ్వుకు మించిన గొప్ప ఔషధము లేదు" అని వారికి తెలుసు.

అక్కడ కలుసుకుని వారంతా హాయిగా నవ్వుకుంటారు. ఒకరికి ఒకరు జోక్స్ చెప్పుకుంటారు. ఒకరు ఒకటి చెబితే ఇంకొకరు మరియొకటి చెబుతారు. అన్నీ నవ్వువచ్చే మాటలే. కొందరు వెంటనే నవ్వుతారు. కొందరు ఆలస్యంగా నవ్వుతారు. అన్నీ జోకులే. అయినా వాటిలోని చమత్కారం గ్రహించినపుడు కదా నవ్వులు వచ్చేది.

ఆ రోజు ముందుగా ఊరిపెద్ద రామనాథంగారు ఇల్లా చెప్పారు-

"మనసు నిండుగా నవ్వాలి. నవ్వడం వలన శరీరపు కండరాలకు, ముఖ్యంగా ముఖంలోని కండరాలకు మంచి వ్యాయామం. దిగులును, భయాన్ని నవ్వు దూరం చేస్తుంది. నవ్వడం అనేది మన మనుషులకే కుదురుతుంది. జంతువులు నవ్వవు. నవ్వడం ఒక యోగం, నవ్వడం ఒక భోగం. వేరే దేశాలలో యంత్రాలతో పనిచేస్తూ- "వేగంగా పరుగులు తీసే బ్రతుకు పద్ధతుల వలన నవ్వడం మరిచిపోతున్నాం" అనుకుంటున్నారు. అలా అనుకుంటున్న వారు అందుకే నవ్వడం కోసం 'లాఫింగ్ క్లబ్" లు పెట్టుకుంటున్నారు. అక్కడ కలుసుకుని పెద్దగా, గట్టిగా, మనసారా నవ్వుకుంటున్నారు. మనదీ అలాంటి సంకల్పమే" అన్నారు రామనాథంగారు

ఆ తరువాత ఆయన అందరినీ సరదాగా ఒకొక్క 'జోకు' చెప్పమన్నారు. ఎవరు జోకు చెప్పాలి, ఎప్పుడు చెప్పాలి అనేది నిర్ణయం చేయడానికి ఒక పద్ధతి పెట్టారు.

అక్కడకు చేరిన వారందరి పేర్లూ చిన్నచిన్న విడి కాగితాల మీద రాసారు. పేర్లు రాసిన ఆ కాగితాలను


మడిచి ఒక డబ్బాలో వేసారు. డబ్బాను బాగా కుదిపి ఒకరి ముందుంచుతారు. అందులోంచి ఒక కాగితం తీయాలి. ఆ కాగితం మీద ఎవరి పేరుంటే వారు ఒక జోకు చెప్పాలి. ఆ జోకువిని అంతా నవ్వులు నవ్వాక, జోకు చెప్పినవారు డబ్బాలోని ఇంకొక కాగితం తీస్తారు. ఆ కాగితంలో ఎవరి పేరు వస్తే వారు తరువాత జోకు చెబుతారు. ఇలా సాగుతుంది. అందరికీ ఆతురత, కుతూహలం, జోకు చెప్పే అవకాశం. అంతా నవ్వులే నవ్వులు.

ఎవరు ఏ జోకు చెప్పారో నేను చెప్పనుగానీ, నవ్వుపుట్టించే ఆ జోకులు కొన్నింటిని ఇక్కడ చేరుస్తున్నాను. ఇవి మీ అందరికీ కూడా హాయిగా నవ్వులు ఇస్తాయి. అని నా నమ్మకం.

★ ★ ★

ఒక ఆసుపత్రిలో వైద్యుని చూసేందుకు వచ్చిన వారందరూ కూర్చుని ఉన్నారు. డాక్టరుగారు ఒకరి తరువాత ఒకరిని లోనికి పిలుస్తున్నారు. కొద్ది సేపటికి డాక్టరుగారు బయటకు వచ్చి ఒకతనిని ఇలా అడిగారు.

“ఏమయ్యా! ఈ బెంచీ మీద ఇంతకు మునుపు గళ్లచొక్కా తొడుగుకుని ఒకాయన ఉండాలి కదా ? ఏడీ?”



“అతనాండీ ! ఒంట్లో బాగోలేదని ఇంటికి వెళ్లి పోయాడు సార్!”

★ ★ ★

ఒక పార్కులో ఎక్కడ చూసినా కాగితాలు చిందర వందరగా పడి వున్నాయి. ‘పార్కును పరిశుభ్రముగా ఉంచ వలెను - పరిసరములలో చెత్త, కాగితములు వేయరాదు’ అని ముద్రించిన కరపత్రములు అంతకుముందే అక్కడ పంచివెళ్లారట, మరి.

★ ★ ★


ప్రేమికుల జంట రూపాయి పల్లీలు కొనుక్కుని పార్కులో ఆనందంగా తింటూ కూర్చున్నారు.



"రాధా! మనిద్దరం ఇలా వెచ్చగా కూర్చుని పల్లీలు తింటూవుంటే నీకు ఏమనిపిస్తోంది" అని ప్రియుడు అడిగాడు.

"నా కంటే నువ్వే ఎక్కువ పల్లీలు తినివేస్తున్నావు అనిపిస్తోంది" అన్నదట ప్రియురాలు.

★ ★ ★



విదేశాల్లో చదువుకుంటున్న ఒక పాప పల్లెటూరికి వచ్చింది. అక్కడి అందాలు చూస్తూ ఆనందిస్తూ కొన్నింటికి ఆశ్చర్యపోతూ ఉంది.



"భలే తమాషాగా ఉందే. ఆ ఆవుకి కొమ్ములే లేవు. ఎందుకు తాతా" అని అడిగింది.

"అదా బుల్లెమ్మగారూ! దానికి చాలా కారణాలు ఉంటాయండి. కొన్ని ఆవులు పుట్టడమే కొమ్ములు లేకుండా పుడతాయండి. దరిమిలా గాని కొమ్ములు తిరగవండి. కొన్నింటికి కొమ్ములు తీసేస్తారండి. ఇంకొన్ని జాతి ఆవులకు అసలు కొమ్ములే ఉండవండి. మీరు చూసిన ఆవుకి కొమ్ములు లేకపోవడానికి కారణం అది ఆవు కాదండి - గుర్రం" అన్నాడు తాత

★ ★ ★



"నేనో మందుకనిపెట్టాను! ఇది తాగినవాళ్లు ఎవరయినా సరే తప్పక నిజమే చెబుతారు." అన్నాడు రామయ్య - సోమయ్యకు కొంచెం రుచి చూడమని ఇస్తూ.


అది కొంచెం తాగి సోమయ్య -

"ఛీ!ఛీ! ఇది మందేమిటి. శుభ్రమైన తేనె." అన్నాడు.

"చూసావా! నిజమే చెప్పావ్" అన్నాడు రామయ్య.

★ ★ ★

" ఎర్రతాడు కట్టిన వంద రూపాయల నోట్లకట్ట ఎవరిదయినా పోయిందా" అని అరిచాడు ఒకాయన.



"నాదే.. నాదే.." అని అరిచాయి పది గొంతుకలు.

"అయితే ఆ ఎర్రతాడు దొరికింది ఇదిగో" అన్నాడాయన.

★ ★ ★

"ఈ ఆపరేషన్‌లో ప్రమాదం వుండదు కదా" అడిగాడు రోగి.

"అదే మేమూ తెలుసుకోబోతున్నాం" అన్నాడు డాక్టరు.

★ ★ ★


టీచరు : గోదానం, అన్నదానం కంటే పెద్దదానం ఏదిరా

కుర్రవాడు : మైదానం టీచర్

★ ★ ★


ఇద్దరు మిత్రులు తమ పెంపుడు కుక్కల గురించి మాటాడు కుంటున్నారు.

ఒకడు : ఆశ్చర్యముగా ఉందే.
మీ కుక్కకు ఇన్ని విషయాలు
ఎలా నేర్పావు ?



రెండవవాడు : పెద్ద కష్టం కాదు. నువ్వూ నేర్పవచ్చు. కానీ నీకు కుక్క కంటే కొంచెము ఎక్కువ తెలివితేటలు వుండాలి.

★ ★ ★



ఒకడు : రాత్రి నాకు ఒక పీడకల వచ్చింది
రెండోవాడు : ఏమిటది
మొదటివాడు : నేనూ పదిమంది అమ్మాయిలూ కలసి ప్రయాణం చేస్తున్నామట
రెండోవాడు : ఏమి! మంచికలే కదా
మొదటివాడు : నేను కూడా అమ్మాయినేనట

★ ★ ★


ఒక సభలో -

"సోదర సోదరీమణులారా! ఇప్పుడు శ్రీ పరమ



యోగానంద స్వామి వారు మౌనము యొక్క గొప్ప దనమును గురించి ఒక గంటసేపు ప్రసంగించెదరు".

★ ★ ★



"గుడ్డివాడిని ధర్మముచెయ్యి తల్లీ"

"చిల్లరలేదు బాబూ"

"పోనీ మీ బుట్టలో ఉన్న అరటి పండ్లలో రెండు ఇవ్వు తల్లీ"

★ ★ ★

రాజు : మా తమ్ముడు గోపి వల్ల పదిమందికి ఉద్యోగాలు దొరికాయి

వాసు : అయితే మీ తమ్ముడు అంత గొప్పవాడన్న మాట

రాజు : అదేమీ కాదు. ఇప్పటికి వాడు పదిచోట్ల ఉద్యోగం మానేసాడు.

★ ★ ★

"నాకు పప్పుపులుసు చాలా ఇష్టం. అది నేను ఎక్కువగా ఇష్టపడడము పిచ్చి అంటున్నారు మావాళ్లు." అన్నాడు పిచ్చి ఆసుపత్రి డాక్టరు దగ్గరకు అప్పుడే వచ్చిన ఒకతను.

"అదెలాగ ? పప్పుపులుసు అంటే నాకూ చాలా ఇష్టం. అందులో తప్పు ఏంలేదే" అన్నాడు డాక్టరు.

"నిజంగానా! అయితే డాక్టరుగారూ! మీరు ఒకసారి మా ఇంటికి రండి. పది పెట్టెల నిండా పప్పుపులుసు నింపి ఉంచాను" అన్నాడు అతను.

★ ★ ★

ఒకతను ఒక అమ్మాయిని ప్రేమించి ఆమె తండ్రిని కలుసుకున్నాడు.

"నేను మీ అమ్మాయిని ప్రేమించాను. పెళ్ళి చేసుకోవాలి అనుకుంటున్నాను" అన్నాడు.

"అది సరే.. నువ్వు మా ఆవిడను చూసావా ముందు" అడిగాడు ఆ తండ్రి.

"ఆ..! చూసాను. కానీ నాకు మీ అమ్మాయే నచ్చింది.' ' అన్నాడు ఆ కుర్రవాడు.

★ ★ ★

టీవీలో వార్తలు చదవడానికి పరీక్ష జరుగుతోంది.

"పరీక్షకు వస్తూ రత్నాలహారం వేసుకుని వచ్చావేమిటోయ్" అడిగాడు పరీక్ష అధికారి వచ్చిన ఒకతనిని చూసి.

అతను : టీవీలో వార్తలు చదవడానికి గొంతు బాగుండాలని మీరే కదా ప్రకటించారు!

★ ★ ★

కొడుకు : నాన్నా! నేను పెద్ద అయిన తరువాత కళ్లడాక్టరు కావాలా? పళ్ళడాక్టరు కావాలా ?

తండ్రి : పళ్ళడాక్టరువే అవు బాబూ !

కొడుకు : ఎందుకు ?


తండ్రి : కళ్లయితే మనిషికి రెండే ఉంటాయి. మరి పళ్లయితే ముప్ఫయ్‌రెండు ఉంటాయికదా!

★ ★ ★

"నేను నీ వయసులో ఉండగా పేపర్లు అమ్మాను. రైలుస్టేషనులో ఇడ్లీలు, కాఫీ, టీలు అమ్మి పొట్ట పోసుకునే, వాడిని తెలుసా" అన్నాడు. లక్షాధికారి అయిన తండ్రి కొడుకుతో

"మంచిపని చేసావు నాన్నా! అది నాకు ఎంతో గర్వకారణం లేకపోతే ఇప్పుడు నేనూ ఆ పనే చేయవలసి వచ్చేది" అన్నాడు కొడుకు.

★ ★ ★



ఉత్తరం రాసి పెట్టమని యజమానురాలిని అడిగింది పనిపిల్ల.

ఉత్తరం రాసిన తరువాత "అంతేనా! చెప్పవలసింది ఇంకా

ఏమయినా ఉందా?" అని అడిగింది యజమానురాలు.

"తప్పులు ఉంటే క్షమించమని చివరివాక్యం రాయండమ్మా" అంది పనమ్మాయి.

★ ★ ★



దుకాణంలోని మనిషి, సుబ్బారావుతో ఇలా అన్నాడు-

‘‘ఈ దుప్పటి కొనండిసార్ ఉతికిన తరువాత తువ్వాలుగా, కొద్ది రోజులకు రుమాలుగా, ఆ తరువాత రిబ్బన్‌గా మీకు నాలుగురకాలుగా ఉపయోగపడుతుంది.

* * *

ఒక పందెంలో ఓడిపోయిన అతను -



"నేను ఇంక జీవితంలో ఎప్పుడూ పందెం కట్టను" అన్నాడు.

"ఊరుకో బావా! నువ్వు పందెం కట్టకుండా ఉండలేవు" అన్నాడు అతని బంధువు.

"ఉండగలను. ఎంతెంత పందెం ?"

★ ★ ★



"రాత్రి నాకు ఒక పెద్ద రొట్టె తినినట్లు కలవచ్చింది" అన్నాడు బాబు.

"మరేం ఇబ్బంది లేదు. తిండి మీద దృష్టి ఎక్కువగా ఉన్నవారికి అటువంటి కలలే వస్తూ ఉంటాయి" అని నర్సు చెప్పింది.

"అదిసరే .. అప్పటి నుంచి ఇక్కడ మంచం మీది దిండు కనిపించడం లేదు" అన్నాడు బాబు.

★ ★ ★

"నేను ఆఫ్రికా అడవుల్లో వేటాడి ఎన్నో పులులను చంపాను" అన్నాడు కొండయ్య గొప్పగా.

"ఆఫ్రికా అడవులలో అసలు పులులే లేవు అని భూగోళశాస్త్రంలో వుందే! అదెలా ?" అన్నాడు అనుమానంగా బెండయ్య.

కొండయ్య: "ఎలా ఉంటాయి? నేను అన్నింటిని చంపేసాను కదా"

అందరూ జోకులు ఒక్కొక్కదానికీ బాగా నవ్వుకున్నారు. ఇంక బాగా చీకటి పడుతోంది. అని ఇక 'నవ్వుల



సమావేశం' ఆ రోజుకు ముగింపు చేయాలి అని అనుకున్నాడు.

ఊరిపెద్ద రామనాధంగారు ఇలా అన్నారు- "మనసారా నవ్వుకుంటే హాయిగా ఉంటుంది. మనం ఆడవారిని కించపరిచేవీ, ఇంకొకరిని బాధపెట్టేవి జోకులు వేసుకోలేదు. అందుకు నాకు సంతోషంగా ఉంది. జోకులు ఏవయినా సరదాగానే తీసుకోవాలి. అవి ఏవయినా కొద్దిసేపు ఆనందించి నవ్వుకోవడం కోసమే. హాస్యం వల్ల హృదయం తేలిక పడుతుంది. వ్యంగ్యం వలన ఒకరిలోని లోపం ఏదయినా గుర్తించేలా చేసి, వారిని వారే సరిదిద్దుకునేలా చేయగలం. ఏమయినా ఈ కార్యక్రమం విజయవంతం చేసినందుకు మీకు అందరికీ ధన్యవాదాలు."

అందరూ ఉల్లాసంగా లేచారు.

★ ★ ★

# "నిరంతర విద్యా కేంద్రములకు" ఉపయోగపడు మా ప్రచురణలు

స్వామీ వివేకానంద

అమరజీవి

కందుకూరి వీరేశలింగం

ఈసప్ నీతికథలు

నవ్వుకుందాం

మన పండుగలు

జానపద కళారూపాలు

అన్నమాచార్యులు

బాలకార్మికులు

నీరు

పురాణబాలలు

జలకాలుష్యం

వాయుకాలుష్యం

శబ్దకాలుష్యం